పన్ను వసూళ్లలో టాప్..!


వందశాతం పన్ను వసూలైన జోడేఘాట్ గ్రామం

- ఇంటిపన్నులు చెల్లింపు వేగం
- పురోగతి సాధిస్తున్న పల్లెలు
- అవగాహన కల్పిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కెరమెరి: ఆదివాసీల్లో అనేక మంది నిరక్షరాస్యులు, చదువుల గురించి అంతగా తెలియదు. అందులోనూ పన్నుల గురించి అసలే తెలియదు. కాని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి పన్నులు చెల్లించి తమవంతు సహకారం అందిస్తున్నారు. అందుకే ఆయా గ్రామాల్లో అనుకున్న సమయంలో ఇంటిపన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నారు.

21 గ్రామ పంచాయతీల్లో వంద శాతం..

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 21 గ్రామ పంచాయతీలో ఏజెన్సీకి చెందినవి, కాని పన్నులు చెల్లింపుల్లో ముందంజలో ఉన్నాయి. వసూలైన అధిక గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు వేగంగా చెల్లించడంతో గిరిపల్లెలు తన ప్రత్యేకతను చాటుకున్నాయి. గ్రామ పంచాయతీల కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ కనబరిచి పన్నులు వసూలు చేశారు. ప్రతీ రోజు గ్రామ సభలు నిర్వహించి, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించడంలో సఫలీకృతమైయ్యారు. పారిశుధ్యం, చెత్త తొలగించడం, వీధి దీపాలకు లైట్లు అమర్చడం, విద్యుత్ స్తంభాలు సరిచేయడం, హరితవనంలో మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, పరిసరాలను పరిశుభ్రం చేయడంవంటి లాంటి పనులతో ప్రజలు ఆకర్శితులవుతున్నారు.


ఇంటి పన్ను వసూలు చేస్తున్న జీపీ సిబ్బంది

గ్రామాల సంక్షేమం కోసం..

గ్రామాల్లో ఇంటి పన్నులు, ఇతరత్రా పన్నుల నుంచి వచ్చే నిధులను గ్రామాభివృద్ధికి ఖర్చు చేయనున్నారు. వీధిదీపాలు అమర్చడం, పారిశుధ్య పనులు చేపట్టడం, సీసీ చార్జిలు చెల్లించడం, కార్యాలయాల పనులకు వాడుకోవడం, స్టేషనరీ ఖర్చులు, కూలీలు, కామాటీల వేతనాలు ఇతర అవసరాల కోసం వసూలు చేసిన పన్నులను ఉపయోగిస్తారు. మండలం 31 గ్రామ పంచాయతీల్లో 9551 గృహాలు ఉండగా.. రూ. 36,07,365 డిమాండ్ ఉంది. గురువారం వరకు రూ 32,70,995 వసూలు చేసి 95 శాతానికి చేరింది. కెరమెరి, అంతాపూర్ మినహా అన్ని గ్రామ పంచాయతీల్లో వంద శాతం పన్నులు వసూలు చేశారు. మరో రెండు రోజులే గడువు ఉండడంతో మిగిలిన రెండు గ్రామ పంచాయతీలు కూడా వందశాతం వసూలు చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

వందశాతం వసూలు


ఇప్పటి వరకు మండలంలోని 95 శాతం ఇంటి పన్నులు వసూలు చేశాం. ఈ నెలాఖరు వరకు మిగిలిన మొత్తాన్ని వసూలు చేస్తాం. గతానికి ఇప్పటికీ ప్రజల్లో చాలా మార్పు వచ్చింది. ఎప్పటికప్పుడు పంచాయతీలను పరిశీలస్తున్నాం. ఇంటిపన్నులు చెల్లించడంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అందుకు స్వచ్ఛందంగా ప్రజలు పన్నులు చెల్లిస్తున్నారు.
– మహమ్మద్ అంజద్‌పాషా, ఎంపీడీవో, కెరమెరి

క్లుప్తంగా

రికార్డులు నమోదు చేయాలి


విద్యార్థిని చదివిస్తున్న ఎంఈవో

కెరమెరి: అన్నిరకాల రికార్డులు నమోదు చేయాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. గురువారం మండలంలోని సాంగ్వి పాఠశాలను సందర్శించారు. ఎఫ్ఎల్ఎన్ రిపోర్టులు, వివిధ రకాల రిజిష్టరును పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. వారంలో మూడుసార్లు తప్పక గుడ్లు అందించాలన్నారు. విధ్యార్థులను తెలుగు చదివించారు. నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు.

నేడు వారసంత వేలం

దహెగాం: మండల కేంద్రంలో ప్రతీ మంగళవారం నిర్వహించే వారసంతకు నేడు వేలం వేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ప్రణీత్ బాబు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ. 5 వేల రూపాయలు డిపాజిట్ చేయాలన్నారు. ముందుగా 50 శాతం నగదును వెంటనే గ్రామ పంచాయతీకి చెల్లించాలన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రామారావ్ మహరాజ్ విగ్రహ పునః ప్రతిష్టాపన


విగ్రహానికి పూలమాల వేస్తున్న భక్తులు

లింగాపూర్: సిర్పూర్(యూ) మండల కేంద్రంలో రామారావ్ మహరాజ్ గారి విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి మండల గ్రామస్తులు, సేవాలాల్ భక్తులు భారీ ఎత్తున పాల్గొన్నారు. సేవాలాల్ దీక్ష గురువు ప్రేమ్‌సింగ్ మహరాజ్ మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో రామారావ్ మహరాజ్ తిరిగి బంజారాల కష్టాలను, సమస్యల పరిష్కారానికి కృషి చేశారని అన్నారు. చెడు వ్యసనాలకు, మద్యపానానికి, మాంసహారానికి దూరంగా ఉండాలని హితబోధ చేశారన్నారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, రవినాయక్, శివప్రసాద్, ఎబీఎస్ జిల్లా అధ్యక్షుడు రవీందర్ రాథోడ్, లోకేందర్, చిరంజీవి, దుప్పనాయక్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌అర్బన్: విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండలంలోని చోర్‌పల్లి, నందూపా గ్రామపంచాయతీ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ రూరల్ ఏఈ ఉర్మిల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న నాయకులు

వాంకిడి: మండల కేంద్రంలోని కేబీ నగర్ కాలనీలో రూ.5 లక్షలతో మంజూరైన సీసీరోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు గురువారం ప్రారంభించారు. మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ స్థాయిలో అనేక అభివృద్ధి పనులు చేపడుతుందన్నారు. సంక్షేమ పథకాలతో అన్నివర్గాల వారికి లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్, నియోజకవర్గ అధ్యక్షుడు దుర్గం జీవన్, నాయకులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలి


మాట్లాడుతున్న ముంజం ఆనంద్‌కుమార్

కాగజ్‌నగర్ రూరల్: నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లో వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని దుర్గానగర్ గ్రామంలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించడం లేదన్నారు. పనులను వేగవంతం చేసి కూలీలందరికీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు.

అలరించిన పాఠశాల వార్షికోత్సవం


మాట్లాడుతున్న ఉదయ్‌బాబు


నృత్యం చేస్తున్న చిన్నారులు

కెరమెరి: దేశస్థాయిలో విద్యావిధానంతో ఆకట్టుకున్న మండలంలోని సావర్‌ఖేడా పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాలలో గురువారం రాత్రి నిర్వహించిన ఐదవ వార్శికోత్సవంలో చిన్నారుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నారు. ఒకటవ తరగతి చెందిన చిన్నారులు స్వాగత నృత్యం ఆహుతులను ఎంతగానే ఆకట్టుకుంది. సాంఘిక, సామాజిక ఇతి వృత్తాలతో చేసిన డ్యాన్సులు అదరగొట్టాయి. గిరిజన సాంప్రదాయ ధోతి, చీరలో చిన్నారులు చేసిన నృత్యాలు భేష్ అనిపించాయి. ఈ సందర్భంగా ఏసీజీఈ(అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ జనరల్ ఎగ్జామినర్) ఉదయబాబు, ఎస్‌వో శ్రీనివాస్, ఎంఈవో ఆడే ప్రకాశ్ మాట్లాడారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ఇంత నిస్నాతులు అవుతున్నారంటే అదంతా రంగయ్య సార్ కృషి అన్నారు. జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించి రంగయ్య మన జిల్లాకే కాదు రాష్ట్రానికి గర్వకారణ మన్నారు. ఈయన్ను అందరు ఆదర్శంగా తీసుకొని ప్రభుత్వ పాఠశాలలను బ్రతికించాలన్నారు. ఎక్కడో మారుమూల గ్రామైనప్పటికి ఇంత పెద్ద సంఖ్యలో పోషకులు, తల్లిదండ్రులు హాజరుకావడం ఐకమత్యానికి, ప్రభుత్వ బడి, రంగయ్యపై ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. జిల్లాలో 17 పాఠశాలలు పీఎం శ్రీకి ఎంపికైతే అందులో సావర్‌ఖెడా ఉందన్నారు. రానున్న ఐదేళ్లలో మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. చిన్నప్పతనం నుంచే చక్కటి అటవాట్లను అలవరుస్తున్న ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు అన్నారు. అనంతరం ప్రతిభకనబర్చిన విద్యార్థులకు సుమారు రూ. 20 వేల వరకు నగదు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కడేర్ల రంగయ్య, గ్రామపెద్దలు కావ్‌డే తుల్సిరాం, సోమ, శ్యాంరావు, లక్ష్మన్, టీజీబీ బ్యాంకే మేనేజర్ శ్రీపా ద్, తుడుందెబ్బ జిల్లా పాధ్యక్షుడు కోవ విజయ్, ఆవిసం జిల్లా అధ్యక్షుడు భరత్, ఆదర్శ రైతు కేంద్రె బాలాజీ, బీజేపీ మండలాధ్యక్షుడు తుకారాం, శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘ నాయకులు రాజ్‌కమలాకర్, చైతన్య, రాహుల్, వినేశ్, శంకర్, డోనర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాల తీరుతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, వెంటనే విచారణ నిర్వహించి వాటిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టీకానంద్, గొడిసెల కార్తీక్ కోరారు. ఈ మేరకు పట్టణంలో గురువారం సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు వినతిపత్రం అందించారు. కాగజ్‌నగర్‌లో పుట్టగొడుగల్లా ప్రైవేట్ ఆస్పత్రులు వెలుస్తున్నాయన్నారు. విచ్చలవిడిగా రోగుల వద్ద నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, జిల్లా వైద్యశాఖ అధికారులు తనిఖీల చేయడం లేదని ఆరోపించారు. స్కానింగ్ సెంటర్లలో అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. వెంటనే ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వేలం ద్వారా రూ. 13 లక్షల ఆదాయం


వేలం వేస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మేజర్ గ్రామ పంచాయతీలో బుధవారం, గురువారం రెండు రోజులు పాటు నిర్వహించిన వారసంత, దినసంత వేలం ద్వారా రూ.13 లక్షల, 5 వేల రూపాయలు ఆదాయం వచ్చిందని ఈవో సంజీవ్‌రావు తెలిపారు. దినసంతకు రూ.3 లక్షల, 25 వేలు, ప్రతీ సోమవారం నిర్వహించే వారసంతకు రూ. 9 లక్షల, 80 వేల ఆదాయం వచ్చిందన్నారు. మొత్తం రూ.13 లక్షల, 5వేల ఆదాయం గ్రామపంచాయతీకి వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది జైస్వాల్ శంకర్‌లాల్, నారాయణ, ఇద్రిస్, తదితరులు పాల్గొన్నారు.

బేల వారసంత ఆదాయం రూ.8,75,100

బేల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం వారసంత వేలం నిర్వహించారు. వేలంలో 5 గురు పాల్గొనగా, బండారి రాకేశ్ రూ.8,75,100కు దక్కించుకున్నాడు. ఎంపీడీవో మహేందర్‌కుమార్, ఎంపీవో మహేశ్‌కుమార్, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి సురేశ్, కారోబారి కళ్యాణ్‌కార్ గజానన్ పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగు లాభదాయకం


మాట్లాడుతున్న శాస్త్రవేత్త బీఎన్ రావు

తలమడుగు: ఆయిల్‌పాం సాగు లాభదాయకమని హైదరాబాద్ శాస్త్రవేత్త బీఎన్ రావు అన్నారు. గురువారం బరంపూర్, మదనపూర్ గ్రామంలో రైతులు సాగు చేస్తున్న ఆయిల్‌పాం పంటలను పరిశీలించారు. రైతులకు సలహాలు, సూచనలు తెలియజేశారు. పంట ఎదుగుదల కోసం ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం పద్ధతుల గురించి వివరించారు. ఆయిల్‌పాం సాగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధిక దిగుబడులను ఏ విధంగా సాధించాలలో వివరించారు. జిల్లా ఉద్యాన అధికారి సుధాకర్, పాల్గొన్నారు.

కార్మికుడికి సన్మానం



శాలువాతో సన్మానిస్తున్న అధికారులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా గోలేటి సీహెచ్‌పీలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తూ మెడికల్ ఇన్ వ్యాలిడేట్ పొందిన ఎంబడి రామయ్యను గురువారం సీహెచ్‌పీ ఆవరణలో అధికారులు, తోటి ఉద్యోగులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికా రు. ఈ సందర్భంగా గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శిగా, సీనియర్ ఏఐటీయూసీ నాయకుడిగా పని చేసిన రామయ్య సీహెచ్‌పీలో పని చేసే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. మెడికల్ ఇన్‌వ్యాలిడేట్‌తో సంస్థకు దూరం అవుతుండగా కాస్త బాధ కలిగించే అంశమైనప్పటికీ శేష జీవితాన్ని సుఖశాంతులతో గడపాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి శ్రీనివాస్, జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జి ఆదాం సమీ, గజ్జల రాజయ్య, అమర్ సింగ్, మెకానికల్ ఫోర్‌మెన్ సంతోష్‌కుమార్, రాజేశ్ పాల్గొన్నారు.

క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కౌటాల: కౌటాల మండల కేంద్రంలోని కొలవార్ సంక్షేమ సంఘం భవనంలో గురువారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు చిత్ర పటానికి ఆదివాసీ సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మన్నేవార్ల పీవీటీజీ సమస్య గురించి ప్రస్తావించారని తెలిపారు. ఆదివాసీల సమస్యల పరిష్కరానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు డబ్బాబాపు, నాయకులు చిలుకలయ్య, సత్తయ్య, సిద్ధయ్య, బాపు, రవి, వెంకటేశ్, బాపురావ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

నార్నూర్: మండలంలోని ఎంపల్లి గొండుగూడలోని శ్రీ అంజనేయస్వామి ఆలయంలో గురువారం ఆదివాసీలు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు పండాలని మొక్కుకున్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్


పోలీసుల అదుపులో నాయకులు

తాంసి: భీంపూర్ మండల బీఆర్ఎస్ నాయకులను భీంపూర్ పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. బోథ్ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన నాయకులను గురువారం తెల్లవారుజామున లక్ష్మీపూర్ గ్రామం వద్ద అదుపులోకి తీసుకోని స్టేషన్‌కు తరలించారు. సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ముట్టడికి బయలుదేరిన సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు మడావి లింబాజీ, నాయకులు వినోద్, అశోక్, బండ్‌లను అరెస్ట్ చేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రెబ్బెన: మండలంలోని పాశిగాం పంచాయతీ పరిధిలోని వరదలగూడలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మల్రాజు రాంబాబు అన్నారు. గురువారం గ్రామస్తులతో కలిసి ఎంపీడీవో శంకరమ్మకు వినతిపత్రం అందచేశారు. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవటంతో ప్రజలకు తాగునీటి సమస్యలు తప్పడం లేదన్నారు. చేతిపంపులకు మరమ్మతులు చేయించాలన్నారు.

అర్హులకు న్యాయం చేయాలి

మండలంలో ఆరు గ్యారంటీల అమలులో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన మండలంలోని పాశిగాంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మల్రాజు రాంబాబు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవోకు వినతిపత్రం అందించిన అనంతరం ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రజలకు జాబితాలో చోటు దక్కకపోగా.. అనర్హులకు ఇళ్లు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు ప్రేంసాగర్, సతీష్, సునీల్, మహేందర్, వెంకటేశ్, సంతోష్, రమేశ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

భగీరథ నీటిని సరఫరా చేయాలి


మాట్లాడుతున్న యెలగతి సుచిత్

వాంకిడి: మండల కేంద్రంలోని పెరుకవాడ, మండోకర్‌వాడల్లో మిషన్ భగీరథ నల్లాలు బిగించి నాలుగేళ్లు అవుతున్నా.. నీటి సరఫరా చేయడం లేదని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి యెలగతి సుచిత్ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం మాట్లాడారు. మిషన్ భగీరథ నీటి సరఫరా చేయాలని ఏఈ శైలెందర్ దృష్టికి సమస్యను పలుమార్లు తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించకుంటే ఖాళీ బిందెలతో ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు వికాస్, ఉపాధ్యక్షుడు దేవకరి సాయి, కార్యదర్శి దుర్గం అక్షయ్ పాల్గొన్నారు.

నిజాయతీ చాటుకున్న కండక్టర్


సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ కెజె.రావ్ తన నిజాయతీ చాటుకున్నాడు. ఆసిఫాబాద్ నుంచి చంద్రాపూర్‌కు వెళ్తున్న బస్సులో ప్రవళిక అనే ప్రయాణికురాలు బెండారా కాలేజీ వద్ద దిగుతూ తన సర్టిఫికెట్‌లను బస్సులోనే మర్చిపోయారు. బస్సును తనిఖీ చేస్తుండగా కండక్టర్ కెజె.రావ్ వాటిని గుర్తించి వెంటనే డిపో అధికారులకు సమాచారం ఇచ్చాడు. సర్టిఫికెట్లలోని వివరాల ఆధారంగా ప్రవళిక ఆచూకీని కనుగొని అందజేశారు. డిపో మేనేజర్ రాజశేఖర్ స్పందిస్తూ సిబ్బంది నిజాయతీని చాటడం ఆర్టీసీకే గర్వ కారణమన్నారు.

వృథాగా భగీరథ నీరు



లింగాపూర్: మండలంలోని మాన్కుగూడ గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కావడంతో రోడ్డుపై భగీరథ నీరు వృథా అవుతోంది. నీరు లీకేజీ అవుతున్నా.. సిబ్బంది మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భగీరథ నీటి లీకేజీలు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

టాస్క్ శిక్షణ తరగతులు ప్రారంభం

కాగజ్‌నగర్‌రూరల్: తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్స్ అండ్ నాలెడ్జ్(టాస్క్) తరగతులను గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీదేవి ప్రారంభించారు. విద్యార్థులందరూ తరగతులకు హాజరై పలు అంశాల్లో ప్రావీణ్యం సంపాదించుకుని జీవితంలో స్థిరపడాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహం మాట్లాడుతూ టాస్క్ తరగతులతో విషయ పరిజ్ఞానంతోపాటు అర్హత గల ఉద్యోగం పొందడానికి ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టాస్క్ కోఆర్డినేటర్ దత్తాత్రేయ, కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న సతీశ్

నేరడిగొండ: చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సతీశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బాల్య వివాహ ముక్త్ భారత్, చైల్డ్ హెల్ప్‌లైన్ అవగాహన కల్పించారు. పిల్లలు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలను వినియోగించుకోవాలన్నారు. హక్కులకు ఎలాంటి భంగం కలిగిన 1098 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల మాట్లాడుతూ చిన్నపిల్లల పెళ్లి చేయడంతో జరిగే అనర్థాలు, పోషకాహార లోపం గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రజిత, డీసీపీయూ సోషల్ వర్కర్ రవికాంత్, ష్యూర్ ఎన్‌జీవో సభ్యులు నరేందర్, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన బాజీరావు బాబా సప్తాహం

బేల: మండలంలోని మశాల(బి) గ్రామంలో వారం రోజులుగా కొనసాగిన ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా సప్తాహ ముగింపు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా బాజీరావు బాబా చిత్రపటంతో పల్లకి ఊరేగించారు. అనంతరం బాజీరావు బాబా ఆలయ ఆవరణలో ప్రధాన శిష్య బృందం భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు. కార్యక్రమంలో మాజీ వైఎస్ ఎంపీపీ బండి సుజాత సుదర్శన్, దోటే ఈశ్వర్, బుబన్ రమేశ్, మార్కండి పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఉట్నూర్ సీఐ మొగిలి అన్నారు. గురువారం మండలంలోని అందునాయక్‌తండా గ్రామంలోని ప్రజలు, యువతతో సమావేశమయ్యారు. గంజాయి తరలించడం, సాగు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.